# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 28-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ‘ఆపరేషన్ సిందూర్’ ద్వారా ఉగ్రవాదం పట్ల భారతదేశ వైఖరిని ప్రపంచానికి తెలియజేశామని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

- ఫిడే (FIDE) ప్రపంచ మహిళల చెస్ ఛాంపియన్ టైటిల్ ను గెలుచుకున్న దివ్య దేశ్‌ముఖ్ కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలిపారు.

- “జల్ జీవన్ మిషన్” పథకాన్ని 2028 సంవత్సర వరకు పొడిగిస్తున్నట్లు కేంద్ర జల్‌శక్తి శాఖ సహాయ మంత్రి వి. సోమన్న వెల్లడించారు.

- దేశ ఆర్థిక వృద్ధిలో సాంకేతికత, ఆవిష్కరణలు కీలక పాత్ర పోషిస్తాయని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందనగా చేపట్టిన ‘ఆపరేషన్ సిందూర్’తో భారత సైన్యం సత్తాను ప్రపంచానికి తెలియజేశామని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. లోక్ సభలో 'ఆపరేషన్ సిందూర్' పై రాజ్‌నాథ్ సింగ్ చర్చను ఈరోజు ప్రారంభించి ప్రసంగించారు. ఇది కేవలం సైనిక చర్య మాత్రమే కాదని, ఉగ్రవాదం పట్ల భారతదేశ విధానాన్ని, పౌరుల పట్ల ప్రభుత్వ నిబద్ధతను తెలియజేస్తుందన్నారు. ఈ ఆపరేషన్ ద్వారా 9 ఉగ్ర శిబిరాలను భారత సైన్యం ధ్వంసం చేసిందని, 100 మందికి పైగా ఉగ్రవాదులు మరణించారని తెలిపారు. ఉగ్రవాద శిబిరాలు, వారి మద్దతుదారులను లక్ష్యంగా చేసుకుని ఆపరేషన్ సిందూర్ చేపట్టామని రాజ్‌నాథ్ సింగ్ వెల్లడిస్తూ....

(వాయిస్ 38 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

“ప్రధాన మంత్రి పోషణ్ శక్తి నిర్మాణ్” పథకం కింద దేశవ్యాప్తంగా సుమారు 11 కోట్ల మంది పిల్లలకు ప్రభుత్వం పౌష్టిక ఆహారాన్ని అందిస్తోందని కేంద్ర విద్యా శాఖా సహాయ మంత్రి జయంత్ చౌదరి తెలిపారు. ఈరోజు లోకసభలో

లిఖితపూర్వక సమాధానమిస్తూ... ఈ పథకం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుండి 8వ తరగతులు చదువుతున్న పిల్లల కోసం అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ పథకం కింద ఆహార ధాన్యాలు, రవాణా నిర్వహణ, పర్యవేక్షణకు అయ్యే ఖర్చులకు సంబందించి 100 శాతం సహాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని ఆయన తెలిపారు. దీని కోసం 2024-25లో భారత ఆహార సంస్థ ద్వారా ప్రభుత్వం సుమారు 9 వేల కోట్ల రూపాయల ఖర్చుతో 26 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలను సరఫరా చేసిందని జయంత్ చౌదరి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ ఆర్థిక వృద్ధిలో సాంకేతికత, ఆవిష్కరణలు కీలక పాత్ర పోషిస్తాయని కేంద్ర భౌగోళిక, శాస్త్ర సాంకేతిక శాఖా సహాయ మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు. ఈరోజు ఢిల్లీలో జరిగిన భౌగోళిక శాస్త్ర మంత్రిత్వ శాఖ 19వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రస్తుతం సమాజంలో సాంకేతికత ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా మొబైల్ ఫోన్లలో వాతావరణం, తుఫాను హెచ్చరికలు, గాలి నాణ్యత నవీకరణలు, సముద్ర సూచనలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకుంటున్నారని తెలిపారు. మరిన్ని సాంకేతికత ఆధారిత పౌర సేవలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. సైన్స్, ఆవిష్కరణలు పర్యావరణ స్థిరత్వానికి కేంద్రంగా నిలుస్తాయని జితేంద్ర సింగ్ పేర్కొంటూ..

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ మంచి నీటి కులాయిలను అందిచాలనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న "జల్ జీవన్ మిషన్" పథకాన్ని 2028 సంవత్సర వరకు పొడిగిస్తున్నామని కేంద్ర జల్‌శక్తి శాఖ సహాయ మంత్రి వి. సోమన్న తెలిపారు. ఈ మేరకు ఈరోజు రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2024 నాటికి ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయిలను అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2019లో ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు. ఇప్పటివరకు ఈ పథకం కింద 15.67 కోట్లకు పైగా గ్రామీణ కుటుంబాల ఇళ్లకు కుళాయి నీటి సరఫరాను అందించినట్లు నివేదికలో పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఫిడే (FIDE) ప్రపంచ మహిళల చెస్ ఛాంపియన్ టైటిల్ ను గెలుచుకున్న దివ్య దేశ్‌ముఖ్ కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలిపారు. దివ్య దేశ్‌ముఖ్‌ని చూసి దేశం గర్వపడుతుందని, ఎంతో మంది యువతకు ఆమె స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. అలాగే కోనేరు హంపీ కూడా ప్రధానమంత్రి అభినందనలు తెలియజేశారు. కాగా జార్జియాలోని బటుమిలో జరిగిన ఫైనల్ లో కోనేరు హంపీపై దివ్య దేశ్ ముఖ్ విజయం సాధించి ఫిడే (FIDE) ప్రపంచ మహిళల చెస్ ఛాంపియన్ టైటిల్ ను సొంతం చేసుకుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (BSNL) 2024-25 ఆర్థిక సంవత్సరం మూడవ, నాల్గవ త్రైమాసికాల్లో వరుసగా 260, 280 కోట్ల రూపాయల నికర లాభాలను నమోదు చేసిందని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. ఈరోజు ఢిల్లీలో టెలికమ్యూనికేషన్ల శాఖ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈ ఆర్థిక సంవత్సరంలో BSNL చరిత్రలో అత్యధికంగా దాదాపు 25 వేల కోట్ల రూపాయలకు పైగా లాభాలను ఆర్జించిందని వెల్లడించారు. గత సంవత్సరం జూన్‌లో 8.55 కోట్లుగా ఉన్న BSNL వినియోదారుల సంఖ్య ఈ ఏడాది 9 కోట్లకు పైగా పెరిగిందని కేంద్ర మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో పెరుగుతున్న ఆర్థిక మోసాల నుండి పెట్టుబడిదారులను రక్షించేందుకు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (SEBI), నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (NSE) సహకారంతో SEBI vs SCAM పేరుతో అవగాహన ప్రచారాన్ని ప్రారంభించింది. నకిలీ ట్రేడింగ్ యాప్‌లు, ఫేక్ వీడియోలు, పెట్టుబడిదారులను తప్పుదారి పట్టించే స్కామ్‌లు, డిజిటల్ ఆర్థిక మోసాలు వంటి వాటిని  నివారించేందుకు ఇది దోహదపడుతుంది. సురక్షితమైన పెట్టుబడి విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించడం వంటి అంశాలు లక్ష్యంగా ఈ ప్రచారాన్ని చేపట్టారు. టెలివిజన్, రేడియో, ప్రింట్, డిజిటల్, సోషల్ మీడియాల ద్వారా దేశవ్యాప్తంగా బహుళ భాషల్లో ప్రజలకు అవగాహనను కల్పిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రావణ సోమవారం పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా ప్రముఖ శైవక్షేత్రాలు భక్తులతో రద్దీగా మారాయి. వారణాసిలోని విశ్వనాథున్ని దర్శించుకునేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాగల 24 గంటలలో తూర్పు రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది. అండమాన్ నికోబార్ దీవులు, బీహార్, పశ్చిమ బెంగాల్, జమ్మూ కాశ్మీర్, జార్ఖండ్, ఒడిశా, తెలంగాణ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అలాగే అండమాన్ నికోబార్ దీవులు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, మాహే, లక్షద్వీప్, ఒడిశా, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్‌లలో బలమైన గాలులు వీస్తాయని IMD తెలిపింది. కాగా రాబోయే 2, 3 రోజుల్లో కర్ణాటక, గుజరాత్, ఉత్తరాఖండ్, బీహార్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, ఈశాన్య రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆ శాఖ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =